
చిన్నారి వినోదం

హాయిగా.. అలా..


● నిండుకుండలా రిజర్వాయర్


● సీబీఆర్


● సేద తీరుతున్న సందర్శకులు

నిండుకుండలా సీబీఆర్
ఆహ్లాదం పంచుతున్న పరిసరాలు
పెరుగుతున్న సందర్శకుల తాకిడి


రిజర్వాయర్ పైభాగాన ఉన్న పూల మొక్కలు


● సందర్శకుల వాహనాలు

తాడిమర్రి మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నిండుకుండలా తొణికిసలాడుతోంది. రిజర్వాయర్ పరిసరాలు కనువిందు చేస్తున్నాయి. గెస్ట్ హౌస్, పార్కులో పరచుకున్న పచ్చదనం, బోటింగ్‌తో పర్యాటకులు పరవశించిపోతున్నారు. సీబీఆర్ అందాలను వీక్షించేందుకు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. కుటుంబికులు అంతా వచ్చి.. బోటింగ్, పార్కులోనే భోజనాలు చేస్తూ రోజంతా ఆహ్లాదంగా గడుపుతున్నారు. డ్యాం దిగువ భాగంలో సాగుచేసిన అరటి, వరి పంటలు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. డ్యాం పైభాగంలో గేట్ల చుట్టూ ఉన్న దిమ్మెలకు రంగులు వేయడంతో చూడటానికి అందంగా కనిపిస్తున్నాయి. గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చిన నీటికి వైఎస్ఆర్ ప్రాజెక్టు నుంచి చేరుతున్న నీరు తోడవడంతో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటి మట్టం 9.3 టీఎంసీలకు చేరుకుంది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ 9.8 టీఎంసీలకు చేరువైంది.

- తాడిమర్రి, ఆంధ్రజ్యోతి

స్థిరాస్తికి రక్షణ ఏదీ?

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి దందా
- ఇష్టారాజ్యంగా డబుల్ రిజిస్ట్రేషన్లు
- అక్రమ రిజిస్ట్రేషన్ల వెనుక ధనం, రాజకీయం


అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఒకరి పేరుతో ఉన్న ఆస్తిని సరైన ఆధారాలు లేకుండా నకిలీ డాక్యుమెంట్లు, తప్పుడు పత్రాలతో సంబంధం లేని వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇందుకుగాను సబ్‌రిజిస్ట్రార్లకు పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెపుతున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ చెల్లకపోయినా రద్దు చేసే అవకాశం లేకపోవడంతో వారు రెచ్చిపోతున్నారు. కనీసం బేరానికి వచ్చి అయినా ఎంతో కొంత ముట్టజెబుతారనో.. లేక మొత్తం ఆస్తి అంతా తమ వశమవుతుందనో కొందరు బరితెగిస్తున్నారు. ఈ విషయంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఏమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో అసలైన హక్కుదారులు బాధితులుగా మారి గగ్గోలు పెడుతున్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్లలో కొన్ని...

- అనంతపురానికి చెందిన నాగమణి హౌసింగ్ బోర్డు సమీపంలోని రూ.60లక్షల విలువైన ఇంటిని ఓ వ్యక్తికి విక్రయించింది. సంబంధిత ఆస్తి రిజిస్ట్రేషన్ ఎనీవేర్ కింద ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ చేశారు. అదే ఆస్తిని ఆ మహిళ తన సమీప బంధువుకు విక్రయించింది. ఇందులో గమ్మత్తేమిటంటే... ఆ ఆస్తికి ధర్మవరంలో రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రారే బదిలీపై అనంతపురం వచ్చారు. ఇక్కడ కూడా ఆయనే రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయంపై బాధితుడు రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్, డీఐజీలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.
- అనంతపురం నగరంలోని సాయినగర్‌లో ఉన్న రూ.1.3కోట్ల ఆస్తి డబుల్ రిజిస్ట్రేషన్ విషయంలో వివాదం నెలకొంది. ఆరో క్రాస్‌లోని రెండు దుకాణాలను యజమాని ప్రదీప్ తొలుత 2004లో డాక్టర్ షరీఫ్‌కు విక్రయించాడు. ఇదే ఆస్తిని ప్రదీప్ 2005లో శివశంకర్ అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయంపై షరీఫ్ భార్య రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీనిపై తామేమీ చేయలేమని చెప్పారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రిజిస్ట్రేషన్ రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది.
- అనంతపురం రూరల్ మండలం నారాయణపురంలో కృష్ణ, అనసూయ దంపతులకు చెందిన భూమిని మరొకరి పేరుతో డబుల్ రిజిస్ట్రేషన్ చేయించారు. దీనికి అనంతపురం రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వేదికైంది. కనగానపల్లి మండలం ముత్తవకుంట్లకు చెందిన ముకుందనాయుడు, పద్మగీత దంపతుల పేర్లతో 1.18 ఎకరాలు డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు.
- బుక్కరాయసముద్రం మండలంలోని ఓ గ్రామంలో రూ.3కోట్ల విలువైన 1.10ఎకరాల భూమి డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ భూమికి సంబంధించి ఇరువర్గాలు కోర్టుకెక్కాయి.
- అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల పరిధిలో పాపంపేటలో 29ఎకరాలతో పాటు కొన్ని భూములు జీపీ పేరుతో చేయించుకున్న వాటిని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించారనే ఆరోపణలున్నాయి.
- ఉమ్మడి జిల్లాల పరిధిలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనూ డబుల్ రిజిస్ట్రేషన్లు చేయించినట్లు సమాచారం. అయితే బాధితులు బయటకు రాకపోవడంతో, విషయాలు

(మిగతా 6లో..)

శిక్షణతోనే సరి..!

అటకెక్కిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ... ఆవేదనలో శిక్షణ పొందిన మహిళలు

ఓబుళదేవరచెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కుట్టుమిషన్ల కోసం శిక్షణ పొందిన పలువురు మహిళలు ఎదురుచూస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టుమిషన్లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈక్రమంలోనే బీసీ సంక్షేమ శాఖ ద్వారా శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. దీంతో ఓబులదేవరచెరువు, నల్లమాడ మండలాల నుంచి అనేక మంది దరఖాస్తు చేస్తున్నారు. అర్హతలు పరిశీలించిన అధికారులు శిక్షణకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. గత ఏప్రిల్‌లో శిక్షణ ప్రారంభించారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ఒక ట్రైనర్‌ను ఏర్పాటు చేశారు. శిక్షణ కేంద్రాలకు కుట్టుమిషన్‌లు, ఇతర సామగ్రిని సమకూర్చారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 1:30 నుండి 5గంటల వరకు మరో బ్యాచ్‌గా ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. ఇలా ఓబులదేవరచెరువు మండలంలో 142, నల్లమాడ మండలంలో 142 మందికి ఆయా మండల కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు. అయితే శిక్షణ పూర్తి అయ్యి నెలలు గడుస్తున్నా, కుట్టు మిషన్‌ల పంపిణీ చేయలేదు.


కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు (ఫైల్)

కూలి పనులు వదిలి శిక్షణకు..

శిక్షణ పొందిన మహిళల్లో చాలా మంది రోజూ కూలి పనులకు వెళ్లే వారే. కుటుంబ పోషణ కష్టమైనా, కుట్టు శిక్షణ పొంది, మిషన్ వస్తే స్వయం ఉపాధి పొందవచ్చన ఆలోచనతో నాలుగు నెలలు పాటు కూలి పనులు వదిలి శిక్షణకు హాజరయ్యారు. ప్రతి రోజూ గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక వ్యయప్రయాసలతో మండలకేంద్రానికి వచ్చి శిక్షణ పొందారు. మూడు నెలల శిక్షణ అనంతరం మహిళలకు రూ.6వేలు విలువ చేసే కుట్టు మిషన్ ఉచితంగా అందజేయాలి. దాంతో పాటు సర్టిఫికెట్ ఇవ్వాలి. శిక్షణ పొంది నాలుగు నెలలు గడుస్తున్నా కుట్టు మిషన్‌లు, సర్టిఫికెట్లు అందలేదు.

తక్షణం ఇవ్వాలి



శిక్షణ పొందితే స్వయం ఉపాధి దొరుకుతుందని ఆశించాం. అందుకే ఎన్ని కష్టాలు వచ్చిన శిక్షణ పూర్తి చేశాం. అయితే ఇంత వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. ప్రభుత్వం స్పందించి తక్షణం కుట్టుమిషన్‌లు పంపిణీ చేసి జీవనోధికి చేయూత ఇవ్వాలి.

- ఎస్. అనిత, గాజుకుంటపల్లి

శిక్షణ పొందినా ఫలితం ఏదీ?



నెలలుపాటు శిక్షణ పొందాం, శిక్షణ పూర్తి అయి కూడా నెలలు గడుస్తున్నాయి. ఇంత వరకు కుట్టుమిషన్, సర్టిఫికెట్ అందలేదు, శిక్షణ పొందినా ఫలితం లేకపోయింది.

- పి. హుస్సేన్ బీ, ఓడి చెరువు

పనులన్నీ వదిలి వెళ్లాం



పనులన్నీ వదిలి కుట్టు శిక్షణకు వెళ్లా. ప్రతి రోజు చార్జీలు పెట్టుకొని వెళ్లి శిక్షణ పొందా. అయితే ఇంతవరకు కుట్టుమిషన్ ఇవ్వలేదు. కుట్టుమిషన్ ఇస్తే స్వయం ఉపాధి పొందవచ్చని ఆశించా. అసలు మిషన్‌లు వస్తాయో రావో చెప్పే నాథుడే లేడు.

- డి.లావణ్య, జమ్ములవాండ్లపల్లి

ఉన్నతాధికారులకు పంపాం

కుట్టు శిక్షణ పొందిన మహిళల వివరాలను ఉన్నతాధికారులకు పంపాం. కుట్టుమిషన్‌లు రావాల్సి ఉంది. కుట్టుమిషన్ రాగానే శిక్షణ పొందిన వారికి తప్పక అందజేస్తాం.

-రామసుబ్బారెడ్డి, ఈడీ, బీసీ కార్పొరేషన్

నకిలీ దందా..!

ఆధార్ అప్‌డేట్ కోసం నకిలీ బర్త్ సర్టిఫికెట్లు

- పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి జారీ
- కాసుల కక్కుర్తితో కొందరు సిబ్బంది ఆగడాలు
- ఆధార్ సెంటర్ నిర్వాహకులకు తప్పని తిప్పలు
- నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలం


ఆధార్ అప్‌డేట్ కోసం వేచి ఉన్న ప్రజలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ బర్త్ సర్టిఫికెట్ల దందా జోరుగా సాగుతోంది. నిబంధనల మేరకు వెళ్తే ఆలస్యం అవుతుందన్న కారణంతో కొందరు ప్రజలు భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను ఊహించలేక ఈ నకిలీ సర్టిఫికెట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. సంబంధిత అధికారులు ఉదాశీనంగా వ్యవహరించడం వల్లే నకిలీ బర్త్ సర్టిఫికెట్ల జారీ యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతా ఫేకే..

ప్రభుత్వ నిబంధనల మేరకు సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ లింకులో బర్త్ సర్టిఫికెట్లు అందుతాయి. ఇలాంటి వెబ్‌సైట్ల ద్వారా కొందరు కేటుగాళ్లు నకిలీ బర్త్ సర్టిఫికెట్లు ఇస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంతో పాటు రాయదుర్గం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, మడకశిర, పెనుకొండ తదితర ప్రాంతాల్లోని పలువురు నెట్‌సెంటర్లలో ఈ ఫేక్ వెబ్‌సైట్లతో నకిలీ సర్టిఫికెట్లను బయటికి తీస్తున్నట్లు సమాచారం. పలు ఆస్పత్రుల నుంచి తెచ్చుకున్న పుట్టిన తేదీ పత్రంతో ఆన్‌లైన్‌లో అప్లై చేసి నిమిషాల్లో బర్త్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. వీటివల్ల భవిష్యత్తులో జరిగే (మిగతా 6లో...)

బాధితులకు సత్వర న్యాయం: ఎస్పీ


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు పునరావృతం కాకుండా బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఆయన ఫిర్యాదిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదిదారులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐలు ఇస్మాయిల్,లక్ష్మీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ చాటాలి

- 11న మంత్రుల కమిటీ సమీక్ష
- అధికారులతో కలెక్టర్ శ్యాంప్రసాద్
- సత్యసాయి శత జయంతి ఏర్పాట్లపై సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి ఆధ్యాత్మిక శోభను చాటేలా సత్యసాయి శత జయంతి వేడుకలను నిర్వహించాలని అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మౌర్యభరద్వాజ్, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 11న రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల బృందం ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహిస్తుందని అన్నారు. ఆ లోగా ఎలాంటి లోపాలు లేకుండా, ప్రణాళిక మేరకు కార్యాచరణను అమలు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కదిరి, ధర్మవరం, హిందూపురం నుంచి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్, పబ్లిక్ హెల్త్, పంచాయతీ అధికారులకు సూచించారు. ట్రాక్టర్లు, డస్ట్ బిన్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పార్కింగ్, లైటింగ్, ఎంట్రీ, ఎగ్జిట్ తదితర వివరాలతో మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖకు సూచించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు గురించి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పలు సూచనలు చేశారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ, చిత్రావతిలో తెప్పోత్సవానికి బోట్లు, గజ ఈతగాళ్లు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఏర్పాటు గురించి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. రూట్ మ్యాప్‌లు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, భద్రత, డ్రోన్ పర్యవేక్షణ, క్యూ మేనేజ్‌మెంట్, వాహనాల మూమెంట్‌పై చర్చించి, తగు సూచనలు ఇచ్చారు. పుట్టపర్తిని సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెలే, మాజీ మంత్రి సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పంచాయితీ రాజ్ ఎస్ఈ మురళి మోహన్, డీపీఓ సమత, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, డీసీహెచ్ఎస్ మధు సూదన్ తదితరులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి

పురంలో వందే భారత్ ఆగుతుంది

- ఎంపీ బీకే పార్థసారథి

హిందూపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలు పది రోజుల్లోపు హిందూపురంలో ఆగుతుందని ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. హిందూపురానికి సోమవారం వచ్చిన ఆయన, విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, తాను రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నతో మాట్లాడామని తెలిపారు. పురంలో వందే భారత్ రైలును ఆపేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు. రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని అన్నారు. బళ్లారి నుంచి మడకశిర మీదుగా రైల్వే ట్రాక్ పనులు వేగంగా సాగుతాయని అన్నారు. చాకర్లపల్లి రైల్వే గేటువద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, దీనికి రూ.29 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఏడాదిలోపే పనులు పూర్తవుతాయని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని, రూ.92 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని అన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ కన్వీనర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, చంద్రమోహన్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అసభ్య ప్రవర్తనకు ఐదేళ్ల జైలు

అనంతపురం క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ. 10 వేల జరిమాన, బాధితురాలికి మరో రూ.10 వేల పరిహారం ఇవ్వాలని జిల్లా పోక్సో కోర్టు న్యాయాధికారి చిన్నబాబు సోమవారం తీర్పు వెలువరించారు. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం మరువపల్లికి చెందిన ముడియం అమర్నాథరెడ్డి (36).. 2022 ఏప్రిల్ 18న హైదరాబాద్ నుంచి అనంతపురానికి ఓ ప్రైవేట్ బస్సులో తల్లితో కలసి వస్తున్న ఐదేళ్ల బాలికతో అసభ్యంగా వ్యవహరించాడు. రాత్రి 2.30 గంటలప్పుడు అతడు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లి అమర్నాథరెడ్డిని అప్పటికప్పుడు తీవ్రంగా మందలించారు. అనంతపురంలో బస్సు దిగగానే. మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి మహిళా ఎస్‌ఐ సులోచన దర్యాప్తు చేసి పోక్సో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోక్సో కోర్టు న్యాయాధికారి చిన్నబాబు సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించారు. అదేవిధంగా బాధితురాలికి రూ.10 వేల పరిహారం కూడా చెల్లించాలని ఆదేశించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిలమత్తూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో రక్షా అకాడమి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ కోరారు.

వృద్ధుడి అదృశ్యం


ఆదినారాయణ(ఫైల్)

కొత్తచెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీకు చెందిన ఆదినారాయణ అనే వృద్ధుడు అదృశ్యమయ్యారు. తన తాత ఆదివారం నుంచి కనిపించడం లేదని ఆయన మనవడు మురళి సోమవారం ఫిర్యాదు చేశారని సీఐ మారుతీ శంకర్ తెలిపారు. ఆదినారాయణకు మతిస్థిమితం సరిగా లేదు. ఎక్కడైనా కనిపిస్తే 9440796838, 9160653665 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

కుక్కకాటు ప్రమాదకరం

గార్లదిన్నె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కుక్క కాటు చాలా ప్రమాదకరమని గార్లదిన్నె పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్కకాటుకు గురైన వారికి ఆయన పలు సలహాలు ఇచ్చారు. కుక్కలు కరిస్తే చాలామంది తేలికగా తీసుకుంటున్నారని తెలిపారు. కుక్క కరవడం వల్ల రేబిస్ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల కుక్క కాటుకు గురై రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుడు మృతి చెందినట్లు గుర్తు చేశారు. కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కుక్కకాటు గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కుక్క కరిచిన వెంటనే.. కరిచిన వద్ద సబ్బుతో శుభ్రంగా కడగాలని, అనంతరం వైద్యులను సంప్రదించాలన్నారు. ఇన్‌ఫెక్షన్ కాకుండా తగిన నివారణ చర్యలు చేస్తారని తెలిపారు.

గురుకుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్

అనంతపురం విద్య, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖలో ఇంటర్ చదివి ఉత్తీర్ణులయిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయాధికారి జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్‌తో పాటు భోజన వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకోవాలనుకునే విద్యార్థులు నేరుగా కార్యాలయంలోగానీ, 9949354106 ఫోన్ నెంబర్‌నుగానీ సంప్రదించవచ్చని డీసీఓ తెలిపారు.

'విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'

అనంతపురం విద్య, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికే జిల్లాలో జీపుయాత్ర చేపట్టినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. సోమవారం టవర్‌క్లాక్‌వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జీపు యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి కేఎస్ఆర్ బాలికల కళాశాలకు వెళ్లి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు. హాస్టల్ విద్యార్థులకు పాత ధరలే అమలు చేస్తుండడంతో మెనూ సక్రమంగా అమలు చేయడంలేదని, నాణ్యమైన భోజనం అందకుండా పోతోందని అన్నారు. అనేక జిల్లాల్లో హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకోలేదన్నారు. కేజీబీవీలు, గురుకులాలు సమస్యలకు నిలయాలుగా మారాయని తెలిపారు. కళాశాలలో బోధన చేయడానికి లెక్చరర్లు లేరని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల రూపంలో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికే జిల్లాలో జీపుయాత్ర చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ.. అనంతపురంలో జీపుయాత్ర మొదలు పెట్టి గార్లదిన్నె, శింగనమల మీదుగా తాడిపత్రికి చేరుకుంటుందన్నారు. యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గిరి, నాయకులు శివ, భీమేష్, సూర్యప్రకాష్, వంశీ, రషీద్, విజయ్, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా బౌలర్లు అదుర్స్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీకే నాయుడు అండర్-23 క్రికెట్ టోర్నీలో ఆంధ్రా జట్టు బౌలర్లు అదరగొట్టారు. అనంతపురం క్రీడా మైదానంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న మ్యాచ్ రెండో రోజు ఒడిశా బ్యాటర్లను కట్టడి చేశారు. ఓవర్‌నైట్ స్కోరు 268-4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిశా జట్టు భారీ స్కోరుపై కన్నేసింది. ఆంధ్రా బౌలర్లు రాజు 3, సుమిత్, ఆదిత్యరెడ్డి చెరో 2, కమిల్, హేమంత్‌రెడ్డి, సాయిశ్రావణ్ వికెట్ తీయడంతో 337 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నియాన్ శ్యామ్ కంగయాన్ ఓవర్‌నైట్ స్కోరు 131కి మరో 10 పరుగులు జోడించి, అవుటయ్యాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. తేజ సెంచరీ (105)తో చెలరేగాడు. అభినవ్ (44) హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు.

10న రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా బ్రాంచ్‌కు ఈనెల 10వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని డీసీఓ క్రిష్ణా నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి గణేష్ సర్కిల్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. పోషకులు, ఉప పోషకులు, జీవితకాల సభ్యులు, అనుబంధ సభ్యులు తమ ఆధార్ కార్డు, సభ్యత్వ గుర్తింపు కార్డుతో హాజరై ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర క్రికెట్ జట్టు, అథ్లెటిక్స్ క్రీడాకారులను ఎంపిక చేశారు.స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం ఎస్‌జీఎఫ్-14 అథ్లెటిక్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు, ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అథ్లెటిక్ బాలురలో శ్రీనాథ్, రితీష్‌రెడ్డి, యశ్వంత్, పవన్, లోకేష్, సమరసింహ, ఆనంద్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో దేవిక, భవ్య, రిధి, అవంతి, గగన, నందక్క, హేమశ్రీ అర్హత సాధించారు. ఎస్‌జీఎఫ్-14 బాలుర జట్టుకు అక్రమ్, జగదీష్‌యాదవ్, తన్వీర్, తోఫిక్, తమోఘ్న, సమృతస్ కన్నన్, అభినవ్, దీపక్, స్నేహిత్ సింహ, లలిత్‌కిషోర్, పవన్, రామ్‌చరణ్, చరణ్‌తేజ్, కౌశిక్‌కుమార్, మెహెల్‌రెడ్డి, క్రితిన్ కార్తికేయ ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు రవీంద్ర పాల్గొన్నారు.

రుణాల రికవరీ సొమ్ము స్వాహా

- రూ.30 లక్షలకుపైగా కాజేసిన బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్
- ప్రసన్నాయపేటలో ఆలస్యంగా వెలుగులోకి..
- బ్యాంకు, వెలుగు అధికారుల విచారణలో బట్టబయలు


పొదుపు మహిళలను విచారిస్తున్న ఏపీ గ్రామీణ బ్యాంకు, వెలుగు అధికారులు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల రుణాలకు సంబంధించి రికవరీ సొమ్మును ఓ బ్యాంకులో పనిచేసే ప్రైవేటు ఉద్యోగి కాజేసిన సంఘటన మండలంలోని ప్రసన్నాయపేటలో ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో స్థానికులు తమకు జరిగిన అన్యాయం గురించి బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. ప్రసన్నాయపేట గ్రామంలో మొత్తం 10 మహిళా సంఘాలు ఉన్నాయి. అందులో కనుముక్కలలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పొదుపు సంఘాల మహిళలు లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకులో గ్రూపుల వారిగా తీసుకున్న రుణాలకు సంబంధించి రికవరీ సొమ్మును అదే గ్రామానికి చెందిన బ్యాంకులో బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్న క్రిష్టారెడ్డికి నెలనెలా కంతుల వారీగా చెల్లిస్తున్నారు. రుణాల రికవరీ విషయమై సంబంధిత వెలుగు సీసీ రమేశ్ గ్రూపుల వారీగా ఆన్‌లైన్‌లో తనిఖీలు చేయగా గుట్టు రట్టయింది. 2023 సంవత్సరం నుంచి రుణాల రికవరీ సొమ్ములో కొంత మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమచేయకుండా పక్కదారి పట్టించాడని గుర్తించారు. దీంతో పొదుపు మహిళలు తమకు జరిగిన అన్యాయం గురించి వెలుగు సిబ్బందితో కలిసి బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి బిజినెస్ కరస్పాండెంట్ క్రిష్టారెడ్డిపై ఫిర్యాదు చేశారు. తాము ప్రతినెలా కంతులు చెల్లిస్తున్నామని, అప్పు చెల్లింపు ఖాతాలో జమచేయకుండా కాజేశారని వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు బ్యాంకు రీజనల్ అధికారులు కనుముక్కల బ్యాంకు ఇన్‌చార్జ్ మేనేజర్ జ్యోతి, డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ, వెలుగు ఏపీఎం నాగేంద్ర సోమవారం గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. స్థానిక రామాలయంలో ఒక్కో గ్రూపు వారీగా 10 గ్రూపులకు సంబంధించిన మహిళలను విచారించగా రూ.30.75 లక్షలు సొమ్ము కాజేసినట్టు తేటతెల్లమైంది. బిజినెస్ కరస్పాండెంట్ నుంచి కాజేసిన సొమ్మును రికవరీ చేస్తామని, ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపారు.

విధేయతకు పట్టం!

- రెండు దశాబ్దాల పనితీరుకు గుర్తింపు
- ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వెంకటప్ప


మంత్రి నారా లోకేశ్‌తో వెంకటప్ప

అనంతపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కార్యకర్తకు గుర్తింపు దక్కింది. రెండు దశాబ్దాలుగా పార్టీ పట్ల చూపిన విధేయతను అధిష్ఠానం గుర్తించింది. టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకుడిగా అనేక కార్యక్రమాలు నిర్వహించిన సామాన్య కార్యకర్త వెంకటప్ప రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి మండలం ఎర్రగుడికి చెందిన వెంకటప్ప 2003లో టీడీపీలో చేరాడు. క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తూ, పార్టీ అనుబంధ విభాగం టీఎన్ఎస్ఎఫ్ ఆవిర్భావం నుంచి ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశాడు. ఉమ్మడి జిల్లా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా దాదాపు పదేళ్లపాటు వెంకటప్ప పనిచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, టీఎన్ఎస్ఎఫ్ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా విద్యార్థి, యువత సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. పోలీసు లాఠీల దెబ్బలు తిన్నారు. వైసీపీ పాలనలో అనేక అక్రమ కేసులను ఎదుర్కొన్నాడు. వెంకటప్పపై 28 కేసుల దాకా ఉన్నాయి.

యువగళంలో..: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపట్టిన యువగళం పాదయాత్రలో వెంకటప్ప భాగస్వామి అయ్యాడు. పాదయాత్ర ముగింపు వరకూ లోకేశ్ వెన్నంటే నిలిచారు. ఈక్రమంలో గిరిజనులతో లోకేశ్ నిర్వహించిన ముఖాముఖిలోనూ వెంకటప్ప పాల్గొన్నాడు. మంత్రి నారా లోకేశ్‌కు సన్నిహితుడిగా మెలుగుతూ వచ్చాడు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆయనకు మంచి పదవి దక్కింది. ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన క్రమంలో... వెంకటప్ప 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఒక పేద కుటుంబానికి చెందిన తాను పార్టీ కోసం అనేక కష్టనష్టాలకు ఓర్చి పనిచేస్తూ వచ్చానన్నారు. పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకొని పనిచేశానని, తన పని తీరును అధిష్ఠానం గుర్తించి పదవి ఇచ్చిందన్నారు. ఈ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు వెల్లడించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గిరిజనుల సమస్యలు పరిష్కారమే అజెండాగా పనిచేస్తానని తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం/పుట్టపర్తిరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు రెండు జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామ్మోహన్‌రెడ్డి, గోవిందనాయక్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అనంతపురం జిల్లాలో తాడిపత్రి మున్సిపాలిటీలో 3, గుత్తి రూరల్ మండలంలో రెండు, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఒకటి, పామిడి మండలం, పెద్దవడుగూరు మండలంలో ఒకటి చొప్పున ఓపెన్ కేటగిరీ దుకాణాలు ఉన్నట్లు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 9 మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మడకశిర, హిందూపురం, సీకేపల్లి, ధర్మవరం, పుట్టపర్తి ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గీత కులాలకు రిజర్వేషన్ కేటగిరీలో అనంతపురం జిల్లాలో మూడు దుకాణాలకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఇందులో కంబదూరు మండలంలో ఒకటి, రాయదుర్గం మున్సిపాలిటీలో రెండు దుకాణాలు ఉన్నాయన్నారు. దరఖాస్తు రుసుం కింద రూ. 2 లక్షలతో డీడీ(నాన్ రీఫండబుల్) తీసి, దరఖాస్తుకు, ఆధార్ కార్డు జత చేసి మాన్యువల్‌గా జిల్లాలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్లలో అందజేయవచ్చునన్నారు. ఈనెల 10వతేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చునని వారు తెలిపారు. ఈనెల 12న ఆ జిల్లాల కలెక్టరేట్‌లో కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీస్తామని వారు పేర్కొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్టేట్ ఫస్ట్


షాజియాబాను

హిందూపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థి షాజియాబాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు హిందూపురం పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. ఆ విద్యార్థి 1000/990 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. తమ కళాశాల నుంచి 900కుపైబడిన మార్కులు ఎనిమిది మంది సాధించారన్నారు. ఎస్.అమీనతస్లీం 969, గ్రీష్మసాయిరెడ్డి 962, సానియా సుల్తానా 962, అఫ్రీనబాను 943, అర్షియ 933, శసిస్తాబాను 923, పూజ 922, ముతహిర 921, సుఫియాసార 906 మార్కులు సాధించారని తెలిపారు.

నేడు మెగా జాబ్‌మేళా

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కమలానగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దామోదరరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ విద్యార్థులు, పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీకాళహస్తి ఆలయ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం


డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న లక్ష్మీనారాయణ

కొత్తచెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆలయ ట్రస్టు డైరెక్టర్‌గా కొత్తచెరువు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనను ఆలయ చైర్మన్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఈఓ బాబిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి పురోహితులు వివరించారు. అనంతరం లక్ష్మీనారాయణ దంపతులకు శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో సినీ నటుడు నారా రోహిత్, టీడీపీ నాయకుడు సంతోష్, మండల కన్వీనర్ రామకృష్ణ, బండ్లపల్లి రాజు, వైపీ మురళీచౌదరి, సందీప్ పాల్గొన్నారు.

శాంతినారాయణకు జీవన సాఫల్య పురస్కారం


పురస్కారం అందుకుంటున్న శాంతినారాయణ

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సీనియర్ రచయిత, విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ అమృతలత జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన ఇందూరు అపురూప అవార్డ్స్ సంస్థ నిర్వాహకులు 2024, 2025 సంవత్సరాలకు సంబంధించి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలనుంచి ఆరుగురు సీనియర్ రచయితలను అమృతలత జీవన సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా 2024 సంవత్సరానికి సంబంధించి అనంతపురం జిల్లాకు శాంతినారాయణ జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. సోమవారం నిజామాబాద్ మామిడిపల్లిలోని శ్రీవారి అపురూప కల్యాణమండపంలో నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవ సభలో శాంతినారాయణకు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత, కథా రచయిత్రి నెల్లుట్ల రమాదేవి, జర్నలిస్టు వల్లీశ్వర్, వెంకటకృష్ణ పురస్కారం అందజేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- పెడపల్లి వద్ద స్కూటర్‌ను ఢీకొన్న ఇన్నోవా
- ఇద్దరు వ్యవసాయ కూలీల మృతి
- ముదిగుబ్బ మండలంలో బైకులు ఢీ.. ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు

పుట్టపర్తి రూరల్, ముదిగుబ్బ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. పుట్టపర్తి మండలం పెడపల్లి శివారులో సోమవారం సాయంత్రం స్కూటర్‌ను ఇన్నోవా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెడపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు మహేశ్, (30), రంగప్ప(31) మృతిచెందారు. వీరిద్దరూ కూలి పనులు ముగించుకుని స్కూటర్‌పై వస్తుండగా హైఎస్సార్ కాలనీ దాటిన తర్వాత పుట్టపర్తి వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఇన్నోవా ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 వాహనంలో పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఇద్దరూ మృతిచెందారు. మహేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రంగప్పకు ఇంకా వివాహం కాలేదు. ప్రమాదానికి కారణమైన వాహనం రంగు, రిజిస్ట్రేషన్ నంబరును స్థానికులు పోలీసులకు ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ లింగన్న తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు.


సుబ్రహ్మణ్యం (ఫైల్)

ద్విచక్ర వాహనాలు ఢీకొని..

ముదిగుబ్బ మండల పరిధిలోని రెండు జీమాన్ల సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు సోమవారం రాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముదిగుబ్బ సాయినగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం(23) మృతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ శివరాముడు తెలిపిన మేరకు, దొరిగల్లు వద్ద గల క్వారీలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం, బైక్‌పై ముదిగుబ్బకు వస్తుండగా, దొరిగల్లుకు చెందిన నరేంద్రబాబు, ఎర్రప్ప ముదిగుబ్బ నుంచి మరో బైక్‌పై ఎదురొచ్చారు. రెండు బైకులు వేగంగా ఢీకొనడంతో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. నరేంద్రబాబు, ఎర్రప్ప తీవ్రంగా గాయపడ్డారు. వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నరేంద్రబాబును అనంతపురానికి తరలించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాండవేశ్వర లింగానికి ప్రత్యేక పూజలు


లింగానికి అభిషేకం చేస్తున్న రమానందన్

లేపాక్షి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక రెండో సోమవారాన్ని పురస్కరించుకుని దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలోని చోళరాజులు నిర్మించిన తాండవేశ్వర లింగానికి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పవిత్రమైన తాండవేశ్వర లింగానికి ప్రతి సోమవారం భక్తులు ప్రత్యేక అలంకరణలు చేస్తుంటారు. భక్తుల మధ్య తాండవేశ్వర లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భోగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ


అలంకరణలో భోగేశ్వరస్వామి

తాడిమర్రి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నదరి గ్రామంలో గడచిన రెండు రోజులుగా నిర్వహిస్తున్న భోగేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ముగింపు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్వామివారి జీర్ణోద్ధరణ సందర్భంగా గ్రామస్థులు బంధువులను ఆహ్వానించారు. అనంతరం ఉత్సవాలలో పాల్గొన్న భక్తులకు గ్రామస్థులు, ఆలయ కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలలో గ్రామస్థులతోపాటు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. పోటీలలో గెలుపొందిన తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్పకు రూ.50వేలు, గార్లదిన్నె రామాంజనేయులుకు రూ.40వేలు, బళ్లారి ఎద్దేశ్వరరెడ్డికి రూ.30వేలు నగదుఅందజేశారు.

భర్త కోసం ఆందోళన


భర్త ఇంటి ముందు బైఠాయించిన భార్య

తాడిమర్రి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తన భర్తను అప్పగించాలంటూ ఓ మహిళ అత్తమామల ఇంటి ముందు ధర్నాకు దిగారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తాడిమర్రికి చెందిన ఓంకార్(అబి) అదే గ్రామానికి చెందిన హిమబిందు ప్రేమించుకుని ఆరునెలల క్రితం వివాహం చేసుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో పెళ్లిపత్రాలపై సంతకాలు కూడా చేశారు. అప్పటి నుంచి ఓంకార్, హిమబిందు వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లకుండా అనంతపురంలో నివాసం ఉండేవారు. 15 రోజుల క్రితం ఓంకార్ తనకు ఆరోగ్యం సరిగా లేదంటూ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తానని తాడిమర్రికి చేరుకున్నారు. హిమబిందు అక్కడే ఉండి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో సోమవారం సాయంత్రం తాడిమర్రికి చేరుకుని ఓంకార్ తల్లిదండ్రులతో గొడవకు దిగింది. తన భర్తను బయటకు పంపాలని దాదాపు గంటపాటు అడిగినా పంపకపోవడంతో ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న వారి ఇంటి ముందు బైఠాయించింది. తన భర్తను తనతో పంపితే చాలంటూ వేడుకుంది. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని.. ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో హిమబిందు ధర్నా విరమించింది.

పేదలందరికీ ఉచిత కంటి వైద్యసేవలు

- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి చైర్మన్ జీఎన్ రావు


మాట్లాడుతున్న జీఎన్ రావు, పక్కన రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఉచిత కంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి చైర్మన్ జీఎన్ రావు తెలిపారు. మండలంలోని నీలకంఠాపురంలో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎన్ రావు మాట్లాడుతూ.. నీలకంఠాపురంలో ప్రారంభించినది 25వ కేంద్రం అన్నారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు పేదలకు సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఆసుపత్రికి స్థలం కేటాయించి, సొంత ఖర్చులతో భవనాలను నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఈ కంటి ఆసుపత్రికి సంబంధించి చుట్టు పక్కల గ్రామాల్లో మరో పది ప్రాథమిక కంటి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కంటికి సంబంధించి వైద్య పరీక్షలు, ఆపరేషన్లు 90 శాతం ఇక్కడే నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, డాక్టర్లు తారప్రసాద్ దాస్, రోహిత్ ఖన్నా, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, రంగయ్య, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పులరాజు, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్, నర్సేగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, తిప్పేస్వామి, ఈరన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వయసు చిన్న.. ప్రతిభ మిన్న

- ఇంటర్నేషనల్ ఫిడే చెస్ రేటింగ్‌లో నిహాల్ ప్రతిభ


నిహాల్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోనే నిహాల్ అనే బాలుడు చెస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. నగరంలోని తపోవనంలో నివాసం ఉంటున్న రాఘవేంద్రబాబు, పల్లవి దంపతుల కుమారుడు నిహాల్‌నయనంజన్ సంగపట్నం. ఈ అబ్బాయి మూడో తరగతి చదువుతున్నాడు. నిహాల్ ఈ ఏడాదిలోనే చెస్ ఆడడం మొదలు పెట్టాడు. 9 నెలల్లోనే రెండు జిల్లా, రెండు రాష్ట్ర, ఒక ఇంటర్నేషనల్ స్థాయిలో పతకాలు సాధించాడు. ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్తంగా విడుదల చేసిన జాబితాలో ఇంటర్నేషనల్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్‌లో నిహాల్ 1505 ర్యాంకు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. చిన్న వయసులోనే పెద్ద రికార్డు సాధించిన నిహాల్‌కి ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, ఏ1 చెస్ అకాడమీ నేషనల్ ఆర్బిటార్ గోవిందరాజులు అభినందనలు తెలిపారు.

న్యూస్ బాక్స్

టూటౌన్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక టూటౌన్ ఎస్ఐగా వెంకటరాముడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శ్రీరాములు ఆర్నెల్ల క్రితం పదవీ విరమణ పొందారు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐగా ఉన్న వెంకటరాముడును టూటౌన్ ఎస్ఐగా బదిలీచేశారు. ఆయన టూటౌన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టగా సిబ్బంది స్వాగతం పలికారు. శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని నూతన ఎస్ఐ తెలిపారు.

చేనేత సమస్యలపై 7న ధర్నా

● చేనేత సంఘం నాయకులు

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న పుట్టపర్తిలోని హ్యాండ్‌లూమ్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్న ధర్నాను విజయ వంతం చేయాలని చేనేత కార్మికసంఘం జిల్లా నాయకుడు ఎస్‌హెచ్ బాషా పిలుపు నిచ్చారు. సీపీఎం స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం తరువాత ప్రధానమైన వృత్తి చేనేత పరిశ్రమ అని, ఈ పరిశ్రమపై అన్ని వర్గాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉండటంతో ఎంతోమంది కార్మికులు ఆకలిచావులు, ఆత్మహత్యలకు బలవుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ వేయడంతో ఈ రంగం మరింత సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చేనేతలను ఆదుకునేందుకు వారి సమస్యలను పరిష్కరించా లని డిమాండ్‌చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు గుంపు హరికుమార్, ఖాదర్‌బాష్‌షా, జంగమన్న పాల్గొన్నారు.

సొసైటీ భూములను కాపాడండి

● కూటమి నాయకుల వినతి



సొసైటీ ఇన్‌చార్జ్‌కు వినతిపత్రం అందిస్తున్న కూటమి నాయకులు

ముదిగుబ్బ, నవంబరు, 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సహకార సొసైటీ ఇన్‌చార్జ్ జనార్దన్‌కు వినతిపత్రం అందించారు. మండలపరిధిలోని గుంజేపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 893-1లో ఉన్న రెండు ఎకరాల 40సెంట్లు భూమి కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించారని, ఆ భూమిలో కొంతమంది వ్యాపార కేంద్రాలు, నివాస గృహాలు ఏర్పాటు చేసుకున్నారని వారు పేర్కొన్నారు. ఆ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకొని సహకార సంఘం అభివృద్ధికి వాడుకోవాలని వినతిపత్రంలో కోరారు. టీడీపీ నాయకులు రమేష్ బాబు, తుమ్మల మనోహర్, చినగాని నరసింహ యాదవ్, ఉత్తమనాయుడు, బీజేపీ నాయకులు మాలపాటి రామకృష్ణ, సోమల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఏర్పాటు చేయాలని సీఎంకు వినతి



ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకుడు ప్రసాద్

కదిరి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని పట్నం గ్రామంలో జాతీయ బ్యాంకును ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుప్పాల ప్రసాద్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కోరారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి శనివారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. పట్నం గ్రామ పంచాయతీ పరిధిలో సమారు పదివేల జనాభా ఉన్నారని, 132 మహిళా సంఘాలు ఉన్నాయని తెలిపారు. గ్రామంలో బ్యాంకు లేకపోవడంతో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కదిరికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

సీఐటీయూ నాయకుడి మృతి



హైదర్‌వలి (ఫైల్)

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీఐటీయూ అనుబంధ ట్రాన్స్‌పోర్ట్ రంగం అధ్యక్షుడు సయ్యద్ హైదర్‌వలీ(67) సోమవారం తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఆరు నెలల క్రితం హైదర్‌వలీ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆయన సీఐటీయూ విభాగంలో 15 ఏళ్లగా ఎన్నో సేవలు చేశారని యూనియన్ నాయకులు తెలిపారు. ఆయన మృతి సీపీఎం, సీఐటీయూకు తీరని లోటని సంతాపం ప్రకటించారు.

ఎమ్మెల్యే సహకారంతోనే గ్రామంలో రోడ్లు



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్

నంబులపూలకుంట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కొత్తపల్లి పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో రోడ్డుపనులు చేపడుతున్నట్లు సర్పంచ్ చంద్రకళ, మాజీ సర్పంచ్ జయరాములనాయుడు తెలిపారు. వారు సోమవారం పంచాయతీ కేంద్రమైన పి. కొత్తపల్లి రోడ్డుకు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారన్నారు. రూ.2.50కోట్లకుపైగా సీఎస్ఆర్ నిధులతో పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్లువేయించడానికి సహకరించిన ఎమ్మెల్యేకి గ్రామస్థులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు వేణుగోపాల్, వెంకటరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, శేఖర్‌రెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు





అలంకరణలో త్రిలింగేశ్వరస్వామి, ఓంకారేశ్వరుడు

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బసవన్నకట్ట వీధిలో వెలసిన త్రిలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రవిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాకారోత్సవం, ఊంజలసేవ, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయ కమిటీ సభ్యులు పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు.

● బత్తలపల్లి : కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా శివాలయలు భక్తులతో కిటకిటలాడాయి. సంఘమేశ్వరాలయం, బత్తలపల్లిలోని ఓంకారేశ్వర ఆలయం. ముస్టూరు శివాలయం, కాటికోటేశ్వర ఆలయలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పరమేశ్వరుడిని దర్శించుకుని, అభిషేకం, అర్చనలు చేయించారు.

కార్తీక దామోదర దీపోత్సవం

● ధర్మవరం రూరల్: పట్టణంలో సోమవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో కార్తీక దామోదర దీపోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటుచేయగా, భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవ దాస్, ఇస్కాన్‌భక్తులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడి ప్రతిమ ఎదుట కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పాలకుల పంతం... కార్మికులకు కష్టాలు

- ఆరు నెలలుగా అందని శానిటేషన్ వస్తువులు
- కౌన్సిల్‌లో తీర్మానాన్ని ఆమోదించని వైనం
- మంత్రి ఆదేశించినా పట్టించుకోని పాలకవర్గం
- సంబంధంలేని మూడుకాలనీల అంశంతో ముడి



ఇన్‌చార్జ్ కమిషనర్‌కు విన్నవిస్తున్న కార్మికులు

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా ధర్మవరం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల పరిస్థితి తయారైంది. మున్సిపాలిటీ పాలకవర్గం పట్టింపులకు పోయి కార్మికులకు అవస్థలు తెచ్చిపెడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు ఆర్నెల్లుగా కార్మికులకు శానిటేషన్‌కు సంబంధించిన వస్తువులను అందించలేదు. దీంతో వారు ఉన్న వాటితోనే పారిశుధ్య పనులు చేస్తున్న దుస్థితి ఇక్కడ నెలకొంది. పాలకులను, మున్సిపాలిటీ అధికారులను వేడుకుంటున్న ఫలితం కనిపించలేదని కార్మికులు అంటున్నారు. తమ ఇబ్బందులను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశించనా పాలక వర్గం పట్టించుకోలేదు. మూడు కాలనీలను మున్సిపాలిటీలోకి తీసుకొస్తేనే కార్మికులకు శానిటేషన్ పరికరాలు అందించే తీర్మానాన్ని ఆమోదిస్తామని పాలకవర్గం తెగేసి చెబుతోంది. పాపం దీంతో నిస్సహాయస్థితిలో కార్మికులు తమ వద్ద ఉన్న వస్తువులతోనే పట్టణంలో పారిశుధ్య పనులు చేస్తున్న పరిస్థితి నెలకొంది.



మురుగు కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

మూడు కాలనీల అంశంతో ముడిపెట్టడం ఏమిటి?

తాము వేకువజామునే నిద్ర లేచి పట్టణంలో పారశుధ్య పనుల్లో నిమగ్నమయ్యే వాళ్లమని, అందుకు తగ్గ వస్తువులు సమకూర్చితే తప్ప పనులు సక్రమంగా జరగవని కార్మికులు అంటున్నారు. తమకు ఏ మాత్రం సంబంధంలేని అంశంతో ముడిపెడుతూ మమ్ములను ఇబ్బందులు పెట్టడం ఏమిటని వాపోతున్నారు. ప్రభుత్వం, పాలక వర్గం తేల్చుకోవాల్సిన మున్సిపాలిటీ విస్తరణ అంశంతో తమకేమి సంబంధమని అంటున్నారు. ఇలా అయితే పట్టణాన్ని ఎలా శుభ్రం చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. ధర్మవరం పట్టణం సమీపంలో పోతులనాగేపల్లి, రేగాటిపల్లి, కుణుతూరు కాలనీలున్నాయి. ఆ కాలనీలలో 12వేల వరకు గృహాలు ఉన్నాయి. ఆ మూడు కాలనీలను మున్సిపాలిటీ పరిధిలోకి చేర్చాలన్నది ప్రస్తుత పాలక వర్గం వాదన. అయితే ఇందుకు సంబంధించి నిబంధనల మేరకు సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే రాజకీయ దురుద్దేశ్యంతోనే ప్రస్తుత పాలకవర్గం ఆ మూడు కాలనీల అంశాన్ని భూతద్దంలో చూపుతూ లేనిపోని సమస్యలు సృష్టిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అంశంతో ఏమాత్రం సంబంధంలేని కార్మికులకు శానిటేషన్ వస్తువులను ఇచ్చే అంశంపై తీర్మానం చేయకుండా కాల యాపన చేయడంఏమిటని పలువురు పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు.

శానిటేషన్ వస్తువులు వచ్చేలా చూస్తాం

మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ వస్తువులు వచ్చేలా చూస్తాం. శానిటేషన్ వస్తువులకు సంబంధించి కౌన్సిల్‌లో ఉంచాం. కొన్ని కారణాల వల్ల ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించాం. కార్మికుల సమస్యను పరిష్కరిస్తాం.

- సాయికృష్ణ, ఇన్‌చార్జ్ కమిషనర్, ధర్మవరం

సీఎం పర్యటనతో కదిరి అభివృద్ధి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల ఒకటో తేదీన నియోజకవర్గంలోని తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో పర్యటించడంతో... కదిరి అభివృద్ధికి నిధులు సమకూరుతాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటనతో నియోజకవర్గం అభివృద్ధిపై ఇక్కడి ప్రజలు, కార్యకర్తల్లో నమ్మకం కలిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రజలకు వరమన్నారు. కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటుకు సీఎం హామీ ఆహ్వానించతగిం దన్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న మైనార్టీ పాఠశాల, పాలిటెక్నికల్ కళాశాలకు నిధులు సమకూరుతాయన్నారు. షాదీఖానాలు, ఖబరస్థాన్ల అభివృద్ధికి నిధులు విడుదల చేశారని తెలిపారు. తిరువీధుల వెడల్పుపై ఇచ్చిన హామీ ఎంతో ముఖ్యమైందన్నారు. త్వరలోనే తిరువీధుల్లోని ప్రజలతో చర్చించి, ఏవి ధంగా వెడల్పు చేయాలో నిర్ణయిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వారికి తగిన నష్ట పరిహారం చెల్లించి, అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ కూడా కదిరిలో పర్యటిస్తారని తెలిపారు. కూటమి నాయకులు సమన్వయంతో కదిరి అభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. వివిధ కంపెనీలిచ్చిన నిధులతో నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లకు ఏడు కొత్తవాహనాలు, జిల్లా కేంద్రానికి ఒక వాహనం కలిపి ఎనిమిది వాహనాల పోలీసులకు త్వరలో అందజేస్తామని తెలిపారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి పోలీస్ వాహనాల కొనుగోలుకు రూ.11లక్షలు అందచేశారన్నారు. త్వరలోనే దాతలందరి సమక్షంలోనే పోలీసులకు వాహనాలు అందజేస్తామన్నారు. మహిళక్రికెటర్లు ప్రపంచ కప్ గెలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మనదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారని ఎమ్మెల్యే వారిని అభినందించారు.

అర్జీలను పారదర్శకంగా పరిష్కరించాలి

కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి వచ్చి ప్రజలు ఇచ్చే అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శాంప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీ మౌర్య భరద్వాజ్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి 306 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతే ప్రామాణికంగా అర్జీల పరిష్కారం, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య డీసీఓ క్రిష్ణా నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

కదిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలకేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో మండలంలోని 25మంది హెచ్ఐవీ బాధితులకు సోమవారం రూరల్ డెవలప్‌మెంట్ ఫ్రెండ్స్ ట్రస్టు ఆ.ధ్వర్యంలో నిత్యవసర వస్తువులు అందించారు. ఈసందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకుడు మంచూర్ మాట్లాడుతూ... హెచ్ఐవీ బాధి తులు అధైర్యపడకుండా మంచి పౌష్టికాహారం, మందులు తీసుకుని వ్యాధినిరోధిక శక్తిని పెంచుకోవాలన్నారు. ట్రస్టు ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. ఆయనతో పాటు జనజాగృతి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, వైద్యాధికారి లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ఇద్దరు అధికారులే హాజరు

నంబులపూలకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం ఇద్దరు అధికారులు మాత్రమే హాజరు కావడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10గంటలకు రావాల్సిన అధికారులు రావడం సంతకాలు పెట్టడం వెళ్లడం జరుగుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండాల్సిన అధికారులు వివిధ రకాల సాకులతో రావడం పోవడం జరుగుతోందని ప్రజలు మండిపడుతున్నారు. తమ సమస్యలను ఎవరికి విన్నవించాలని ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ ఏమో మండలాధికారులకు ఫిర్యాదు చేయాలని చెబుతున్నారేకానీ, మండలంలో ఏ అధికారులూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఉండడంలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలకేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరయ్యేలా చూడాలని కోరుతున్నారు.

సొంత నిధులతో గ్రామానికి రోడ్డు

తనకల్లు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమికుంటపల్లి పంచాయతీ పెద్దపల్లికి చెందిన డాక్టర్ ముక్తియార్ బాషా రూ.4లక్షల సొంత నిధులను వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామస్థుల విన్నపం మేరకు ఆయన సొంత నిధులతో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు సమకూర్చి రోడ్డు నిర్మాణం చేపట్టారు. తాము ఎన్నిమార్లు సర్పంచ్, అధికారులను అడిగినా పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు. అడిగిన వెంటనే సొంత నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టిన ముక్తియార్ బాషాకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కుంచించుకు పోయిన
రోడ్లతో ఇబ్బందులు



బుక్కపట్నం రహదారిలో ఇరుక్కుపోయిన వరికోత యంత్రం

కొత్తచెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇరువైపులా అక్రమ నిర్మాణాల వల్ల మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ రోడ్లు ఇరువైపుల అక్రమ నిర్మాణాలు నిర్మించడంతో రోడ్లు కుంచిం చుకుపోయాయి. దీంతో నిత్యం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. భారీ వాహనాలు ఇరుక్కుపోవడం, దీంతో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ కావడం తరచూ జరుగుతోంది. సోమవారం కూడా స్థానిక బుక్కపట్నం రహదారిలో వరికోత యంత్రం ఇరుక్కుపోయి, ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇటీవల ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు అర్అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చి, అక్రమణ దారులకు నోటీసులు అందజేశారు. అయితే కొందరు స్వచ్ఛందంగా తొలగించుకున్నా, మరికొందరు తొలగించలేదు. బుక్కపట్నం రహదారిలో అర్అండ్‌బీ, పంచాయతీ గదుల ఎదుట దుకాణదారులు రోడ్డుపైకి రేకుల షెడ్‌లు వేసుకోవడంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా ఆర్అండ్‌బీ రోడ్లను ఆక్రమించి దుకాణాలను ఏర్పాటుచేసుకోవడం వల్ల రోడ్లు మరింతగా కుంచించుకుపోయాయి. ఇక్కడ ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో కదిరి, ముదిగుబ్బకు వెళ్లే బస్సులను రోడ్లపైనే నిలుపుతుండటంతో ఆ సమయా ల్లో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం ధ్యేయం

● మాజీ మంత్రి పల్లె ● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న కుటుంబాలకు అపన్నహస్తం అందించడం, రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ... ఇచ్చినమాట ప్రకారం ముఖ్యమంత్రి అనారోగ్యాలతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ఆసుపత్రి ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందజేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన మొత్తం రూ.2,39,623 చెక్కులను మాజీమంత్రి లబ్ధిదారలకు అందజేశారు. కార్యక్రమంలో వెంగళమ్మచెరువు సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శేఖర్

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచనతో సోమవారం స్థానిక మారుతీ రాఘవేంద్ర స్వామి కళ్యాణమండపంలో మండల ప్రవాస్ యోజనలో భాగంగా సమావేశాన్ని నిర్వహిం చారు. ప్రవాస్ యోజన పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మవరం పట్టణ పోలింగ్ బూత్ కమిటీలను, శక్తికేంద్రాలను, వివిధ మోర్చాల కమిటీలను నియమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి గడపకు చేరేవిధంగా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబుళేశు, జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి, నాయకులు పోతుల సురేశ్, గుండా పుల్లయ్య జింకా ప్రవీణ్, చంద్రమౌళి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

కదిరికి సీఎం వరాలు ప్రకటించడంపై హర్షం

తనకల్లు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భా గంగా తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లికి ఇటీవల వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కదిరి అభివృద్ధికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అడిగిన వెంటనే వరాలు ప్రకటించడం పట్ల టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దుల క్రిష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం తనకల్లులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కదిరిలోని మైనార్టీ, ఐటీఐ కళాశాలలు ఏర్పాటుతో పాటు కదిరి లక్ష్మీనరసింహస్వామి మాడవీధుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో షాదీమహళ్ల నిర్మాణానికి కూడా నిధులు ప్రకటించడం ద్వారా మైనార్టీలపై ముఖ్యమంత్రికి ఉన్న అభిమానం తెలియజేస్తోందన్నారు. ఎమ్మెల్యే కందికుంట నాయకత్వంలోనే కదిరి అభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలోనే కదిరి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



మంజునాథ్(ఫైల్)

ధర్మవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతతో పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన మంజునాథ్(22) అనే యువకుడు ఉరి వేసుకున్నాడు. కాలనీకి చెందిన తులసమ్మ, వెంకటేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు వేణుగోపాల్ పుట్టపర్తిలో ఆటో తోలుతుంటాడు. తులసమ్మ అక్కడే ఇళ్లలో పనులు చేస్తుంటారు. మంజునాథ్ ధర్మవరంలోనే ఉంటూ.. శుభకార్యాలకు డెకరేషన్ చేసేవాడు. వెంకటేశ్‌కు పక్షవాతం రావడంతో మడకశిరలోని తన తల్లి వద్ద ఉంటున్నారు. మంజునాథ్‌కు సోమవారం సాయంత్రం తులసమ్మ ఫోన్ చేయగా, సరిగా మాట్లాడలేదు. దీంతో అనుమానం వచ్చి పెద్ద కుమారుడితో కలిసి ధర్మవరానికి వచ్చారు. ఇంటికి వెళ్లి చూసే సరికి మంజునాథ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి అనారోగ్యం, అప్పు చేసి ఆటో తీసుకోవడంతో తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, అందుకే చిన్న కుమారుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నారని తులసమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థినులు



ఎంపికైన జీవీఈ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు

ధర్మవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో శనివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలలో ధర్మవరం విద్యార్థినులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు జీవీఈజడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం సుమన తెలిపారు. ధర్మవరంలోని జీవీఈజడ్పీ బాలికల ఉన్నతపాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సింధు మైనస్ 32కిలోల విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.అదే విధంగా తొమ్మిదో తరగతికి చెందిన అఖిల, సుష్మిత, ప్రణీత, తన్మయి, ఎనిమిదో తరగతికిచెందిన ప్రణవి రెండవస్థానంలో నిలిచారన్నారు. వీరు ఈ నెల 7,8 తేదీలలో అనంతపురం ఇండోర్‌స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థినులను సోమవారం పాఠశాలలో పాఠశాల హెచ్ఎంతో పాటు పీఈటీలు స్వరూప, సరళ, కోచ్‌లు ఇనాయత్‌బాషా, నవ్యశ్రీ అభినందించారు. చదువుతోపాటుక్రీడలలో కూడా రాణించి రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని వారు ఆకాంక్షించారు.

న్యూస్ బాక్స్

వైభవంగా కార్తీకమాస పూజలు



శివుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

పెనుకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో అలంకరించారు. మంగళవారం ఆలయంలో గోపూజ, రథాంగ హోమం, 10గంటలకు ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం 12గంటలకు రథోత్సవం, సాయంత్ర 6నుంచి పూజా సంకల్పం, గంగపూజ కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులందరూ పెద్దఎత్తున పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని సభ్యులు కోరారు.



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మడకశిరటౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రమౌళేశ్వర స్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీకమాస సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రమౌళేశ్వరస్వామిని రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకు పూజ, అభిషేకాలునిర్వహించారు.



అగళి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శంకరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధూడి వీరభద్రేశ్వరస్వామి, కొమరేపల్లి బీరలింగేశ్వరస్వామి, నగరసంబోధి లక్ష్మీరంగనాథ స్వామి, ఇనగలూరు శివాలయంలో పూజలు నిర్వహించారు.

ఆలయ జీర్ణోద్ధరణ



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

వైభవంగా హిందూపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు దాల్వాటంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణను వైభవంగా నిర్వహించారు. మూడు రోజులపాటు వేడుకలు వైభవంగా సాగాయి. సోమవారం జరిగిన కార్యక్రమం లో ఎంపీలు బీకేపార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, మధుగిరి ఎమ్మెల్యే రాజన్న, కర్ణాటక రాష్ట్రం గౌరీబిదునూరు మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి, హిందూపురానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



కళశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

రొళ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపల్లి గ్రామంలో వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠపన సోమవా రం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక స్వామీజీ హాజరయ్యారు. మహిళలు బియ్యం పిండితో హారతులను స్వామికి సమర్పించారు.

వార్డు అభివృద్ధికి రూ.5లక్షలు: చైర్మన్



మాట్లాడుతున్న అధ్యక్ష, ఉపాధ్యక్షులు

పావగడ, నవంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణ వ్యాప్తంగా 23వార్డులలో ప్రతి వార్డుకు రూ.5లక్షలు చొప్పున నిధులు కేటాయించనున్నట్లు మున్సిపల్ అధ్యక్షుడు జి. సుదేశ్‌బాబు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన చివరి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదు సంవత్సరాల నుంచి అభివృద్ధి పనుల పేరిట మున్సిపల్ సిబ్బందిని పౌర కార్మికులను నిందించి ఉంటే క్షమించాలని పట్టణాభివృద్ధికి కృషిచేయడమే కౌన్సిలర్ల బాధ్యత అని అన్నారు. ఏ వార్డులోనైనా సమస్యలు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్య అధికారి జాఫర్‌షరీఫ్, ఉపాధ్యక్షులు మాలిన్‌తాజ్, కౌన్సిలర్లు రవి, రాజేష్, గీత హనుమంతరావు, జాహ్నవి, ఇమ్రాన్, రామాంజినప్ప, నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతికి సంతాపం



వీఆర్ఏ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

సోమందేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగేచెరువు గ్రామ వీఆర్ఏ తలారి నరసయ్య అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం టీడీపీనాయకులు సంతాపం వ్యక్తం చేశారు. నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప పూలమాలలువేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సింగిల్‌విండో అధ్యక్షుడు పూలవెంకటేశులు, చిన్నయ్య పాల్గొన్నారు.

దేవుడి సేవే లక్ష్యం: ఆలయ చైర్మన్



ప్రమాణస్వీకారం చేస్తున్న సూగూరు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు చిత్రంలో ఎంపీ పార్థసారథి

హిందూపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవుడికి సేవ చేయాలన్నదే నా లక్ష్యమని సూగూరు ఆంజనేయస్వామి ఆలయ నూతన చైర్మన్ వైసీ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆలయం వద్ద చైర్మన్, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ అధికారులు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పూజల్లో ఎంపీ బీకే పార్థసారథి, జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, జనసేన ఉమేష్, బేవనహళ్లి ఆనంద్, అశ్వత్థనారాయణరెడ్డి, మంగేష్, రామక్రిష్ణప్ప, రాజు, ఆదినారాయణప్ప, వెంకటరమణ, అనిల్‌కుమార్, మంజు పాల్గొన్నారు.

రాతివిగ్రహానికి శంకుస్థాపన: సూగూరు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో 40 అడుగుల రాతి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలుచేశారు. కార్యక్రమంలో ఎంపీతోపాటు ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి: ఎస్టీయూ



సభ్యత్వ నమోదు చేపడుతున్న ఎస్టీయూ నాయకులు

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని శెట్టిపల్లి, కొండాపురం, రాంపురం, పెనుకొండ, వెంకటరెడ్డిపల్లి, మరువపల్లి, తిమ్మాపురం హైస్కూల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టెట్ మినహాయించేవిధంగా కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ఐదు సంవత్సరాలకు పైగా సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలోపు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ పాస్‌కావాలని సుప్రీం కోర్టు తీర్పును ఇచ్చిందన్నారు. ఉపాధ్యాయులందరూ టెస్ట్‌రాసి పాస్‌కావాలని ప్రభుత్వం నిబంధనలు విధించకుండా సుప్రీం కోర్టులో ఇన్‌సర్వీసు టీచర్లకు మినహాయింపు పిటిషన్ దాఖలు చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రవీంద్ర, లక్ష్మీనర్సింహప్ప, విజయ్, నర్సింహారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు హంద్రీనీవా కాలువ పనుల పరిశీలన

మడకశిరటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో అమరాపురం చెరువును నింపి సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చే కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో, పనుల్లో వేగం పెంచేందుకు కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మంగళవారం పనులను పరిశీలించనున్నట్లు మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. ఉదయం 10 గంటలకు మణూరు గ్రామంలో కాలువ పనులను పరిశీలిస్తారన్నారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం హేమావతి టూరిజం గెస్ట్‌హౌస్‌లో జిల్లా, మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. 12.30 గంటలకు అమరాపురం చేరుకొని వక్కమార్కెట్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. 2 గంటలకు కలెక్టర్‌తో కలిసి గుడిబండ మండలం దాసరిపల్లి వద్ద హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తారని, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ఈసొత్తు అభియానను సద్వినియోగం చేసుకోండి

పావగడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రవేశపెట్టిన ఈ సొత్తు అభియాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ ఉత్తమ్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సర్వేనంబరు, అలినేషన్, చేసిన ఇల్లుకు 11 ఏబీ ఫారంలో భర్తీ చేసి గ్రామ పంచాయతీ పీడీఓలకు అందజేస్తే వారంలోపు వారి ఇళ్లకు భూములకు చెందిన దాఖలాలను మీ ఇళ్లవద్దకే అందేలా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వీటికి సంబంధించిన పన్నులు తప్పనిసరిగా కట్టాల్సి ఉంటుందన్నారు. ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగుల పత్రం వీటన్నింటని గ్రామ పంచాయతీ పరిధిలోనే దరఖాస్తు చేసుకుని పొందవచ్చన్నారు. తాలూకా వ్యాప్తంగా 90,768 ఆస్తిదారులలో ఈ సొత్తు అభియానకు 30414 మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, మిగిలిన 60వేల మంది దరఖాస్తులకు దూరంగా ఉన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆయన సూచించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలలోని గౌనివారిపల్లికి చెందిన ఆంజనేయులు(28) అనే యువకుడు పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. రంగప్పకుమారుడైన ఆంజనేయులు కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపానికి గురై గొర్రెలకు ఉపయోగించే మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతన్ని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం హిందూపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పరిగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఊటకూరు గ్రామంలోని పెన్నానదిలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు ప్రభుత్వ అనుమతులు పొందకుండా కర్ణాటక రాష్ట్రానికి, ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నట్లు స్థానికుల సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఊటకూరుకు చెందిన రెండు ట్రాక్టర్లు, పరిగికి చెందిన ఓ ట్రాక్టర్‌ను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

కేబుల్ చోరీ

సోమందేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబాబయ్యపల్లి గ్రామంలో శనివారం రాత్రి బోరుకు ఉన్న కేబుల్‌ను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. అర్ధరాత్రివేళ బోర్లకు ఉన్న కేబుల్‌ను కత్తిరించడంతో ఉదయం వెళ్లి బోరు ఆన్‌చేయగా పనిచేయలేదని గమనిస్తే కేబుల్ చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించామన్నారు. గ్రామంలో బోర్లు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య ఉందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

వృద్ధురాలి మృతిపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వృద్ధురాలి మృతిపై ఆరాతీస్తున్న ఎంపీడీఓ

రొద్దం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పెన్షన్ కోసం వెళ్లి మృత్యువాత పడిన వృద్ధురాలు హనుమక్క విషయంపై జిల్లాస్థాయి అధికారులు ఆరాతీయడంతో ఎంపీడీఓ రాంకుమార్, ఈఓఆర్డీ గోవిందప్ప క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో పింఛన్ కోసం వెళ్లిన వృద్ధురాలి మృతి అన్న కథనం ప్రచురితం కావడంతో స్పందించిన జిల్లాస్థాయి అధికారులు వివరాలు కోరడంతో మండల స్థాయి అధికారులు దళితవాడలో విచారణ చేపట్టారు. మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో ఆమె ఆరోగ్య విషయంపై ఆరాతీశారు. ఇదివరకే ఆమెకు అనారోగ్య సమస్యలుండేవని పింఛన్ రోజునే అస్వస్థతకు గురైందని అధికారులకు వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పెన్షన్ ఇంటివద్దే ఇస్తున్నామని ఎంపీడీఓ వివరించారు.

వేమన విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం



రెడ్డి సంఘం నాయకులకు విరాళం అందజేస్తున్న వెంకటరెడ్డి

గోరంట్ల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటరెడ్డి యోగివేమన విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం సోమవారం అందించారు. పట్టణంలోని హిందూపురం ప్రధాన రహదారి పక్కన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో వేమన విగ్రహం ఏర్పాటుకు ఇటీవల శ్రీకారం చుట్టారు. రెడ్డిసంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. వారి అభ్యర్థన మేరకు వెంకటరెడ్డి రూ.లక్ష నగదును అందించారు. అశ్వత్థరెడ్డి, రాజారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నిషా గార్మెంట్స్ పరిశీలన

పరిగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కొంతకాలం నుంచి వ్యర్థాల మురుగునీరు జయమంగళి నదిలో కలుస్తుండటంతో పరిశీలించి సోమవారం యాజమాన్యంతో చర్చించి మురుగునీటిని రీసైకిల్ ఎలా చేస్తున్నారంటూ నిషాగార్మెంట్స్ యజామాన్యాన్ని బీజేపీ నాయకలు ప్రశ్నించారు. వ్యర్థాల మురుగునీటిని జయమంగళి నదిలో వదలకుండా పరిశ్రమలోనే డంప్ చేసుకోవాలని బీజేపీ నాయకుడు వేణుగోపాల్‌రావు సూచించారు. మండల కన్వీనర్ మూర్తి, బద్రీ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ

రొళ్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్ఐగా వీరేష్ బాధ్యతలు చేపట్టారు. అగళి స్టేషన్‌లో పనిచేస్తున్న వీరేష్ బదిలీపై రొళ్ల కు బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వీరాంజనేయులు రొద్దంకు బదిలీపై వెళ్లారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రత విషయంలో అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచి కర్ణాటక మద్యం రవాణాను అరికడతామన్నారు.

వృత్తి నైపుణ్యంపై పోటీలు



రొళ్ల కేజీబీవీలో ప్రెజెంటేషన్ ఇస్తున్న విద్యార్థినులు

రొద్దం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో ఒకేషనల్ సబ్జెక్ట్ అయిన డ్యూటీ అండ్ వెల్నెస్‌పై పాఠశాలస్థాయి వృత్తినైపుణ్యంపై పోటీలు నిర్వహించారు. సోమవారం పాఠశాలలో 9, 10, 12వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి 9వ తరగతి విద్యార్థులు మైనావతి, తేజశ్విని, పూర్ణబిందు, పవిత్ర, 12వ తరగతి లావణ్య, అక్షిత, మహేశ్వరి, స్నేహ, అశ్విని, శిల్ప, లహరి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ తెలిపారు. వీరందరూ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికకాగా 7వ తేదీన వారు పోటీల్లో పాల్గొంటారన్నారు.

అగళి(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో బ్యూటీ అండ్ వెల్నెస్ ఐటీ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం స్కిల్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించడం, వివిధ కార్యక్రమాలు హెయిర్ స్టైలింగ్ ఫేషియల్, మేకప్, నైల్‌ఆర్ట్, స్కిన్ కేర్, డెమోన్‌స్ట్రేషన్ చేశారు. ఐటీ విభాగంలో కంప్యూటర్ ప్రెజెంటేషన్లు, డేటా ఎంట్రీ, డిజిటల్ డిజైన్, కోడింగ్ ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ విజయకుమారి విద్యార్థుల నైపుణ్యాన్ని అభినందించారు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం.. టైరు కిందపడి చిరిగిన చీరలు

- బస్సును ఆపి చేనేత కార్మికుల వాగ్వాదం
- స్థానికుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

సోమందేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పట్టు చీరలు చిరిగిపోయాయని చేనేత కార్మికులు వాగ్వాదానికి దిగారు. ధర్మవరం నుంచి సోమందేపల్లి మీదుగా హిందూపురం వెళ్తున్న ఆర్టీసీ కాంట్రాక్టు బస్సును ఆపి, డ్రైవర్‌ను నిలదీశారు. స్త్రీశక్తి పథకం అమలులో ఉన్నందున ఆర్టీసీ బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఉదయం 9గంటలకు ధర్మవరానికి చీరలు తీసుకెళ్లడానికి బస్టాండు వద్దకు చేరుకున్న గీతా నగర్‌కు చెందిన చేనేతలు ఆదినారాయణ, అశ్వత్థనారాయణ చీరల బ్యాగులను బస్సులోకి ఎక్కిస్తుండగా డ్రైవర్ బస్సును కదిలించారు. దీంతో చీరలు టైరుకిందపడి దెబ్బతిన్నాయి. మొత్తం 15 చీరలు చిరిగిపోయాయి. ఇందులో ఏడు చీరలు ఎందుకూ పనికిరాకుండాపోయాయి. కార్మికులు బస్సు డ్రైవర్‌ను నిలదీయగా నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన చేనేతలు ధర్మవరం నుంచి తిరిగి వెళుతున్న బస్సును సోమందేపల్లిలో ఆపి గొడవకు దిగారు. నష్ట పరిహారం ఇవ్వాలని ఆర్టీసీ బస్సు డ్రైవర్, యజమాని రేవంత్‌ను డిమాండ్ చేశారు. స్థానికులు కలుగజేసుకుని సర్దిచెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది.



చిరిగిన చీరలను చూపుతున్న కార్మికులు

ప్రపంచ కప్ విజయోత్సవాలు



సంబరాలు జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెనుకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రపంచ కప్ క్రికెట్ విజేతగా భారత దేశ మహిళా జట్టు కప్పు గెలవడం పట్ల వివిధ పాఠశాలల్లో విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. సోమవారం నగర పంచాయతీ వెంకటరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వీట్లు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు గిరిజమ్మ భారతి, కరుణకుమారి, రేష్మా, బాను, ఆనందమ్మ, నరేష్‌కుమార్, బాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ నాయకుల సంబరాలు

పెనుకొండ టౌన్: మహిళా ప్రపంచకప్ విజయోత్సవ సంబరాలను టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం అన్నక్యాంటీన్ వద్ద జాతీయ పతాకం చేతబట్టి బాణసంచాకాల్చి సంబరాలు జరుపుకున్నారు. పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. కన్వీనర్ శ్రీరాములు, బీజేపీ రామక్రిష్ణ, రామాంజి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, ఎగువగడ్డ క్రిష్ణమూర్తి, చంద్రకాంతమ్మ, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

రహదారి వివాదంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

గోరంట్ల, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలివాండ్లపల్లి రహదారి వివాదంపై గ్రామస్థులు తహసీల్దార్ మారుతికి సోమవారం ఫిర్యాదు చేశారు. కదిరి ప్రధాన రహదారి నుంచి బూదిలివాండ్లపల్లి వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు అధ్వానంగా తయారైంది. గ్రామస్థులు ఎక్స్‌కవేటర్ ద్వారా గుంతలకు మట్టి వేసి బాగుచేయాలని చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి రహదారి స్థలం తమదేనంటూ గ్రామంలోకి వెళ్లకూడదని అభ్యంతరం తెలుపుతున్నట్లు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామానికి సీసీరోడ్డు మంజూరైనా వేయకుండా అడ్డుపడుతున్నారని, గ్రామంలోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించి రోడ్డు మరమ్మతు జరిగేలా చూడాలని కోరారు.

గ్రామ కార్యదర్శిపై...: మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీ కార్యదర్శి ఫరూక్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని గ్రామస్థులు ఎంపీడీఓ కమలాబాయికి సోమవారం ఫిర్యాదు చేశారు. నెలరోజులుగా కార్యదర్శి కనిపించలేదని, ఫోన్ చేసినా స్పందించలేదని ఆరోపించారు. విధులకు సరిగా హాజరుకాని అతనిపై చర్యలు చేపట్టి, నూతన కార్యదర్శిని నియమించాలని బాలక్రిష్ణ, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, జగనాథరెడ్డి, పవన్‌కుమార్ కోరారు. అయితే వారం రోజులక్రితమే కార్యదర్శి ఫరూక్ విధులో చేరినట్లు ఎంపీడీఓ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: సీఐ



వాహన రికార్డులను పరిశీలిస్తున్న సీఐ జనార్దన్

చిలమత్తూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించి టిప్పర్ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హిందూపురం రూరల్ సీఐ జనార్ధన్ హెచ్చరించారు. మండలంలోని 544-ఈ జాతీయ రహదారిపై కనుమ ప్రాంతంలో ఆయన సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. క్వారీల నుంచి కంకర తీసుకెళ్లే టిప్పర్లు నిబంధనలను అతిక్రమించి నడుపుతున్నారన్నారు. అతి వేగంతో వాహనాలు నడపడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. వాహనాలకు లైసెన్స్, బీమా, డ్రైవర్‌కి లైసెన్స్ తప్పక ఉండాలన్నారు. పరిమితికి మించి లోడుతో వెళ్లరాదన్నారు. ముందు వెళుతున్న వాహనాలను ఓవర్ టేక్ చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కంకర లోడుతో వెళ్లే టిప్పర్లను ఆపి వాటి రికార్డులను సీఐ పరిశీలించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



మాట్లాడుతున్న చరిత్ర పరిశోధకుడు మైనాస్వామి

పెనుకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం సోమవారంతో ముగిసింది. స్థానిక గగన్‌మహల్‌లో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ వెంకటేశ్వర్లు, చరిత్రకారుడు మైనాస్వామి, హెచ్ఎం జ్యోతిర్మయి, మాధవి హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటివల్ల జరిగే దుష్పరిణామాలను వివరించారు. గగన్‌మహల్ లాంటి చారిత్రక ప్రదేశాలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుభ్రపరచడం ఆనందంగా ఉందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి నర్సింహులు, అధ్యాపకులు రామన్న, చంద్రమోహన్ పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మరక్షణ కళలు అవసరం



కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

సోమందేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలికలకు ఆత్మరక్షణ విద్య అవసరమని ఎంఈఓ ఆంజనేయులునాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లల భద్రత అత్యవసరమన్నారు. ప్రతి విద్యార్థిని ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం సాధించాలన్నారు. హెచ్ఎం రామాంజనేయులు, పీఈటీ అలివేలమ్మ, మాస్టర్ వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.